


# ప్రతీకారం

## పల్లేటి బాలాజీ

## ఆదివారం ఆంధ్రప్రభ 6-9-92




**"అబ్బయ్యొస్తున్నాడ్రే కిట్టిగా..!** ఎదురెళ్ళి పెట్టేబేడా తీస్కో" అన్న నాన్నగారి కేకతో కొట్టంలోంచి పరుగున నాకెదురు వచ్చి సూట్‌కేస్ అందుకుంటూ –

"బాబో! మీరొత్తన్నట్లు కాకితో కబురంపుంటే రోడ్డు కాడ్నే కాస్కునుండేవాడ్నే" అన్నాడు కిష్టడు.

"అనుకోకుండా బయలుదేరేశాను కిష్టా!" అన్నాను సూట్‌కేస్ వాడికిస్తూ.

పట్నం నుంచి నేనెప్పుడు ఊరుకొస్తున్నా ముందుగా ఇంటికి ఉత్తరం రాస్తాను. దాన్ని చూసి కిష్టడ్ని బస్సు దగ్గరకు పంపుతారు. నా చిన్నప్పటి నించీ కిష్టడు మా యింటి దగ్గరే ఎంతో నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఇంట్లో ఎంతమంది పాలేర్లు వున్నా కిష్టడంటే ప్రత్యేకంగా చూస్తారు. ఒళ్ళు దాచుకోకుండా పనిచేస్తాడు. మిగిలిన పాలేర్ల దగ్గర కూడా దబాయించి పని చేయిస్తాడు. అందుకనే కిష్టడ్ని ప్రత్యేకంగా

చూస్తారు కాబోలు.

"ఏరా పరీక్షలు బాగా రాశావా?" ఇంటి గుమ్మంలోకి అడుగుపెట్టంతోటే గంభీరంగా ప్రశ్నించిన నాన్నగారివంక చూడకుండా

"ఆఁ!" అని ముక్తసరిగా సమాధానం చెప్పి లోపలకెళ్ళిపోయాను.

నాన్నగారి బుర్రమీసాల వంక ఆయనగారి భీకర ఆకారం వంక చూడాలంటే చిన్నప్పటినుంచీ భయమే. నాకేంటీ మా ఊళ్ళో వాళ్ళందరూ కూడా.. "మీసాల వెంకటరత్నం నాయుడుగారితో మాటాడాలంటేనే భయమేత్తది" అంటుంటారు.

నాకే అవసరమొచ్చినా అమ్మతోనే మాట్లాడేవాడిని.

"బాబో మీ సదువు" అంటూ నన్ను ఏదో ప్రశ్నించబోయిన కిష్టడు.

"ఒరేయ్ కిట్టిగా! కొట్టంలో మిగిలిన గొడ్లకు గెడ్డి వెయ్యరా" అని వరండాలోంచి నాన్నగారు అరచిన కేకకు అదిరిపడి బయటకు వెళ్ళిపోయాడు.

నాన్నగారెప్పుడూ వరండాలోని వాలు కుర్చీలో కూర్చుని తాపీగా చుట్ట త్రాగుతూ పనులు పురమాయిస్తుంటారు. ఆయన వరండాలోంచి చూస్తే దొడ్లోని గొడ్లన్నీ కనిపించాల్సిందే. ఏ గొడ్డు ముందు గడ్డిలేదో ప్రత్యేకంగా చెప్పి మరీ వేయిస్తుంటారు. గొడ్లంటే ఆయనకు ఎంతో ప్రీతి. పాలిచ్చే బర్రెలంటే మరీ ప్రీతి. పాడి కుండ నిండిన యింట్లో లక్ష్మీదేవి తాండవం చేస్తుందె అంటుంటారు అమ్మతో అప్పుడప్పుడూ. అందుకనే పాలిచ్చే బర్రెలకు పచ్చిగెడ్డి ప్రత్యేకంగా తెప్పించి మరీ వేయిస్తుంటారు.

పొలం పనులు చేసే ఒంగోలు గిత్తలకైతే బెల్లం, అంబలి, అరటి పళ్ళు నున్నతో కలిపి తినిపిస్తుంటారు.

"ఏం బాబూ ఇప్పుడేనా రావడం?" అని ఎంతో ఆప్యాయంగా అడిగింది అమ్మ.

"అవునమ్మా!" అన్నాను.

"వెళ్ళి మొహం కడుక్కో. టిఫిన్ రెడీగా వుంచుతాను" అంది అమ్మ.

"అలాగేనమ్మా!" అని లుంగీ కట్టుకుని బాత్రూముకి వెళ్ళి మొహం కడుక్కుని అమ్మ పెట్టిన టిఫిన్ తృప్తిగా తిని రెస్టు తీసుకునేందుకు మంచం ఎక్కాను.

"నమస్కారమండీ నాయుడుగారూ!" అంటూ వచ్చి నాన్న ఎదురుగా నిల్చున్నాడో వ్యక్తి. అతడి పక్కనే నలుగురు నిలబడి ఉన్నారు.

"నువ్వు.. చింతలాపురం రామమూర్తి తమ్ముడివి కదూ?" అనుమానంగా అడిగాడు ఎదురుగా నిలబడిన వ్యక్తిని.

"అవునండి.. ఆర్నెల్ల క్రితం రాయబారం నాటకం వేసినప్పుడు చూశారు. మళ్ళీ యిదే చూడ్డం. అందుకని మర్చిపోయివుంటారు" అన్నాడా వ్యక్తి.

"భలేవాడివోయ్.. నిన్నెలా మర్చిపోతాను కూర్చో. ఏదన్నా నాటకం వేస్తున్నారా?" నవ్వుతూ ప్రశ్నించారు.

"అవునండీ. పై ఆదివారం చింతలాపురంలో కురుక్షేత్రం వేస్తున్నాం. గూడూరు పార్వతిని, బైనా బాలయ్యనికూడా పిలిపిస్తున్నాం. మీరు తప్పకుండా రావాలి" అన్నాడా వ్యక్తి.

"అలాగే.. వెళ్ళిరండి" అని వాళ్ళను సాగనంపారు నాన్న.

మంచి ఎండ కాస్తోంది.

పాలేర్లందరికీ సంగటి ముద్దలు వడ్డిస్తోంది అమ్మ. పాలేర్లందరూ మాంచి ఆకలి మీదున్నట్లున్నారు. ఒకరితో ఒకరు ఏమీ మాట్లాడకుండా ఆవురావురుమని తింటున్నారు. అప్పుడే అక్కడకు వచ్చిన నాన్నగారు.

"ఏవే కిట్టడికి ఇంకో ముద్ద సంగటెయ్యవే" అన్నారు అమ్మతో.

"చాలు సావేఁ పొట్ట ఉబ్బుకుంది. ఇంక తింటే పగిలిపోద్ది" అన్నాడు కిష్టడు సంతోషంగా.

వాడి మొహంలో యజమాని తనను ప్రత్యేకంగా చూస్తూ గౌరవిస్తున్నాడన్న కృతజ్ఞతా భావం కదలాడింది.

"తినరా వెధవా! ఈ వయసులో తినలేకపోతే వయసు మీరినాక తినలేవు" అన్నారు నాన్న.

నాన్న చెప్పకపోయినా అమ్మ కిష్టడ్ని పాలేర్లందరిలోకి ప్రత్యేకంగా చూస్తుంది. అందరికంటే ఓ ముద్ద తిండెక్కువెయ్యడం – అప్పుడప్పుడూ కాఫీలివ్వడం చేస్తుంటుంది.

"ఒరే కిట్టిగా.. ఈ ఎండు చేప వంకాయ పులుసో గంటేసుకున్నావంటే ఇంకో రెండు ముద్దల సంగటి తినేస్తావు" అని ఓ ముద్ద సంగటితోపాటు గరిట పులుసు కూడా వేసింది అమ్మ.

పాలేర్లందరూ తిన్న తర్వాత పశువుల కొట్టంలో ఓ మూల కూర్చుని బీడీలు కాల్చసాగారు.

"రేయ్ ఎదవ నాయాల్లారా! ఎపుడైనా బీడీ ముక్కలు గెడ్డి మోపుల మీదేత్తారేమోరే జాగర్త" అని బీడీలు కాలుస్తున్న పాలేర్లని హెచ్చరించాడు కిష్టడు.

వాడలా స్వంత మనిషిలా యజమానికెక్కడ నష్టం జరుగుతుందోనని జాగ్రత్త పడుతున్నాడంటే నిజంగా వాడికీ ఈ యింటికి ఏదో రుణానుబంధం వుండి వుంటుంది. లేదంటే వాడూ మిగిలిన పాలేర్లలా పనెగ్గొట్టి పచార్లు చేసుండేవాడేమో? అనుకున్నాను వాడ్ని చూస్తూ.

"రేయ్...! ఏ వెదవ నాకొడుకురా ఈ దున్నపోతు దగ్గర పచ్చి గెడ్డేసింది?" కొట్టంలోంచి పొలికేకలా నాన్న అరిచిన అరుపుకి కుడితి తొట్ల దగ్గర ఎద్దులకు నీళ్ళు పెడ్తున్న కిష్టడు కొట్టం దగ్గరకు పరుగెత్తుకెళ్ళి

"యాంది సావే?" అని ప్రశ్నించాడు.

"పనీపాటా లేని ఈ దున్నపోతు ముందర పచ్చిగెడ్డేసిన్నాకొడుకెవడ్రా?" కోపంగా ప్రశ్నించాడు నాన్న.

"ఈ పూటే పన్లోకొచ్చిన యెంగిసిగోడ్ని ఎడ్లకు గెడ్డేసి చుక్కల బర్రెకి పుల్లబర్రికి పచ్చి గెడ్డెయ్యమన్నాను. యెదవ ఈ దున్నక్కూడా పచ్చి గెడ్డేసినాడు" అన్నాడు కిష్టడు.

"ఆ వెధవనిట్ట పిల్చుకురా" కోపంగా చెప్పాడు నాన్న.

రెండు నిముషాల్లో వాడ్ని నాన్న ముందర నిలబెట్టాడు కిష్టడు.

"ఏరా! నువ్వేనా దీనిముందర వచ్చి గెడ్డేసింది?" గుడ్లురుముతూ ప్రశ్నించాడు నాన్న.

నాన్న ప్రశ్నించిన తీరుకి వాడు నిలువెల్లా వణికిపోతూ.."అ..అ..అ..ఆ" అన్నాడు.

"దున్నపోతులకెవడన్నా పచ్చిగెడ్డేసాడంట్రా దున్నపోతా? ముందరా పచ్చి గెడ్డి తీసి పుల్ల బర్రి మందర పడేయ్" అని కసిరి చెప్పాడు నాన్న.

తన ముందున్న పచ్చిగడ్డి తీసేందుకు వంగిన యెంగిసిగాడి వంక, నాన్నవంక గుర్రుమని చూసింది దున్నపోతు.

కొద్దిగా వెనక్కి జంకాడు వాడు.

"గెడ్డి తీసెయ్‌రా వెధవా" తొందర చేశారు నాన్న. ఆలస్యం చేసే కొద్దీ పచ్చిగెడ్డి పూర్తిగా దున్నపోతు ఎక్కడ తినేస్తుందేమోనన్న భయం కాబోలు నాన్నకి.

దున్నపోతు నోటికాడ పచ్చగడ్డిని వేసిన తన చేతుల్తోనే తీసేసాడు పాపం వాడు.

దున్నపోతు అదోలా చూసింది నాన్నగారి వైపు. దాని చూపుకర్థం ఏంటో నాకర్థం కాలేదు.

నాన్నగారు వాలు కుర్చీలో తాపీగా చుట్ట తాగుతున్నారు.

అప్పుడే తల్లిని ఆసరాగా చేసుకుని వచ్చి వాకిట్లో నిలబడ్డాడు కిష్టడు. వాడ్ని చూస్తుంటే మునుపటంత బలంగా లేడు. మొహం పీక్కుపోయి అదోలా ఉన్నాడు.

"ఏరా కిట్టిగా ఇరవై దినాలవుతున్నా ఇంకా జబ్బు తగ్గలా?" చుట్ట పొగవదుల్తూ ప్రశ్నించాడు నాన్న.

"లేద్సావే! వొల్లంతా మరి నీరసంగా ఉండాది" ఇంకా ఏదో చెప్పబోతున్న కిష్టడి మాటలకు అడ్డు తగుల్తూ.

"సోవేఁ ఈడి కుడికాలు కూడా సక్కరంగా కదలడం లేదయ్యా" అంది కిష్టడి తల్లి.

"సర్లె దొడ్డి తలుపు దగ్గరకెళ్ళు సంగటేస్తది. తినేసి ఆచారి దగ్గరకెళ్ళి నేను చెప్పానని మంచి మందు తీసుకో" అని విసుగ్గా చెప్పాడు నాన్న. దొడ్డి తలుపు దగ్గరకి వెళ్ళారు వాళ్ళు.

"ఇరవైరోజుల ముందు వరకూ కిష్టడ్ని ఎంతో ఆదరించి అభిమానించిన నాన్నగారు సడెన్‌గా వాడితో ఎందుకిలా విసుగ్గా మాట్లాడుతున్నారు? ఇరవైరోజులుగా వాడు పనిలోకి రాలేదనా? పనిలోకి రాలేదంటే కేవలం ఆరోగ్యం సరిగ్గా లేకనే కదా? ఏంటో నాన్నగారి ప్రవర్తన" అనుకున్నాను బాధగా. కిష్టడూ వాళ్లమ్మ అమ్మ పెట్టిన సంగటి తిని వచ్చిన తర్వాత నాన్న ముందర నిలబడి చేతులు నలుపుకుంటూ "సోవే! ఆసారిగోరి మందుకు ఈడి జబ్బు తగ్గ ముకం

పట్టేటట్లేదు. పట్నమెల్లి ఇంగిలీసు డాక్టరుకి సూపిస్తే నయమవుతాదేమో" అని ఇంకా ఏదో చెప్పబోతున్న ఆమె మాటలకు అడ్డొస్తూ 'నీ మొహం లేవే! ఎంత జబ్బునైనా చిటికెలో నయం చేయగల ఆచారి మనకుండగా ఆ ఇంగ్లీషు డాక్టర్ల గోలెందుకే?" అని గట్టిగా కసిరినట్టుగా చెప్పాడు నాన్న.

నాన్న మాటలు విన్న కిష్టడి మొహంలో, వాడి తల్లి మొహంలో అదో విధమైన బాధ తొంగి చూసింది.

అయినా ఆశ చంపుకోలేక కాబోలు – 'సావే పట్నం ఎల్లి డాకట్రుకి సూపించుకునేకి అప్పుగా డబ్బులియ్యండి. ఒల్లు నయం అయినాక మీకే సాకిరి సేత్తా రుణం ఉంచను" అని కళ్ళలోంచి ఉబికివస్తున్న కన్నీటిని అదిమిపెట్టుకుంటూ దీనంగా  అడిగాడు కిష్టడు.

"ఒరే కిట్టిగా నీకు నిజంగా పిచ్చి పట్టిందిరా! మన ఆచారి తగ్గించలేని జబ్బుని పట్నం డాక్టర్లు తగ్గిస్తార్రా నా మాట విని నువ్వు ఆచారి దగ్గర చూపించుకోరా! మంచిగా చెప్పినట్టనిపించినా కచ్చితంగా చెప్పాడు.

"సావే నేనిన్నాల్లూ మీ కాడ ఒల్లు దాసుకోకుండా పంజేసిందానికై అప్పియ్యండి. మీ రుణం ఉంచుకోను" ఏడుస్తూనే అర్థించాడు కిష్తడు.

చుట్ట ఆకరి దమ్ము పీల్చి పీకను విసిరేసి –

"కిట్టిగా నువ్వు పట్నంలో చూపించుకున్నా జబ్బు తగ్గదని ఆచారి చెప్పాడు. అందుకని నీకు అప్పిస్తే తిరిగిరాదు. దున్నపోతునెలా పచ్చిగడ్డేసి పెంచమో అలా పనికి రాని పాలేరుని కూడా అప్పులిచ్చి ఆదరించలేము. నా ఇంట్లో నువ్వు ఒళ్ళు దాచుకోకుండా పనిచేశావు కాబట్టి రోజూ వచ్చి అంత సంగటి తినిపో. ఎంతో ఖచ్చితంగా వ్యాపారాత్మకంగా మాట్లాడాడు నాన్న.

షాక్ తగిలినంత పనయ్యింది నాకు.

నాన్న ఆ విధంగా మాట్లాడతాడని నేను ఊహించని విషయం.

తల్లిని ఆసరా చేసుకుని నిరాశగా వెనుతిరిగాడు కిష్టడు.

నా దగ్గర పాకెట్ మనీ డబ్బుని నాన్నకు తెలియకుండా కిష్టడుకిద్దామని దొడ్డిదోవన వెళ్ళేసరికి గోడవారగా కూర్చుని ఏడుస్తున్న కిష్టడ్ని అతని తల్లి ఓదార్చుతూ –

"ఓర్నాయనా.. 'దొర్లసిత్తం మాకుల్నీడా' ఒకటని నేనెప్పుడో సెప్పాను. ఇప్పుడేడ్సి ఏం లాబంరా? కనకయ్య పొలం ముక్తాకిత్తాను సేసుకోరా అంటే 'నాయుడోరికి అన్నేయం సేసి మక్తాసెయ్యలేను' అన్నావు. ఇప్పుడు సూడు.." అంటున్న ఆమె దగ్గరికి వెళ్ళి –

"చూడమ్మా! ఇదిగో ఈ డబ్బుతో కిష్టడ్ని పట్నం తీసుకెళ్ళి డాక్టరుకు చూపించు" అని డబ్బు ఆమె చేతిలో పెట్టాను.

"బాబో.. నిజ్జంగా ఆ పై మాటలు రాక చేతులెత్తి దణ్ణం పెట్టాడు కిష్టడు.

"నీ ఆరోగ్యం బాగా చూసుకో కిష్టా!" అని వెనుతిరిగాను.

నా మనస్సంతా ఏదో తెలియని బాధ ఆక్రమించింది.

ఉదయం నేను నిద్రలేచి పెరట్లోని వేపచెట్టు దగ్గరకెళ్ళి పుల్లించుకుంటుండగా

"నమస్కారమండీ నాయుడుగారూ" అంటూ నాన్న దగ్గరకొచ్చి నిలబడ్డాడో వ్యక్తి. అతడివైపు చూసిన నేను ఈ మధ్య చింతలాపురంలో నాటకం వేసిన వ్యక్తిగా గుర్తించాను.

"కూర్చోవయ్యా కూర్చో.. మా ఊళ్ళో నాటకం వేసినప్పుడు మంచి ఏర్పాట్లు చేశావయ్యా" అభినందించాడు నాన్న.

"ఏదో తమలాంటి పెద్దల సహాయ సహకారాలుండబట్టి" అన్నాడా వ్యక్తి.

"ఆ .. ఏంటి సంగతులు" తాపీగా చుట్ట వెలిగిస్తూ అడిగాడు నాన్న.

"చింతలాపురంలో కురుక్షేత్రం వేశాం కదా.. మనూళ్ళో కూడా ఏదన్నా నాటకం వేద్దామని" అన్నాడా వ్యక్తి.

"మీరు నా ఊళ్ళో నాటకమే వేయాలనుకుంటే నా వైపు నుంచి పూర్తి సహాయం ఉంటుంది. అంటే నాటకానికయ్యే ఖర్చులన్నీ నేనే భరిస్తాను" అని భరోసా ఇచ్చాడు నాన్న.

"మీ ఊర్లో నాటకం వేసేటప్పుడుకూడా మా దగ్గర ఖర్చు పెట్టిస్తారా మీరు?" అని నాన్నని పొగిడి "ఇంతకీ మనూర్లో ఏ నాటకమేస్తే బాగుంటుంది?" అని ప్రశ్నించాడు.

చుట్ట పొగపీలుస్తూ ఆలోచించసాగాడు నాన్న.

"కొన్ని సంవత్సరాలుగా ఈ ఇంటికోసం తన కండలన్నీ కరిగించాడు కిష్టడు. అలాంటి వాడు జబ్బునపడి డబ్బడిగితే కచ్చితంగా ఇవ్వనని తెగేసి చెప్పాడు. అలాంటి నాన్న ఈ రోజు ఎవడో వచ్చి నాటకం వేస్తున్నానంటే ఖర్చులన్నీ నేనే భరిస్తానని బరోసా యిచ్చాడు. ఏంటో ఈయన మనస్తత్వం?" అనుకుంటూ పళ్ళు తోముకోసాగాను.

"సతీసావిత్రి వేస్తే ఎలా గుంటుందయ్యా?" చుట్టముక్కను పారేస్తూ అడిగాడు నాన్న.

"భేషుగ్గా ఉంటుందండీ.. కాకపోతే" అని అర్థోక్తిలో ఆపాడు.

"ఆ..కాకపోతే?" ప్రశ్నించాడు నాన్న.

"యమధర్మరాజు వేషం తమరేస్తే తప్ప రాణించదు నాటకం" ఠక్కున చెప్పాడతను.

"భలేవాడివయ్యా! నేను నాటకాలు వేసి చాలా రోజులయింది. ఇపుడు మళ్ళీ వేయడం అంటే కష్టం."

"వారం రోజులు రిహార్సలు చేస్తే అత్యద్భుతంగా నటించగలరు."

"నన్నొత్తిడి చెయ్యకయ్యా" అని నవ్వాడు నాన్న. నాన్నగారి మొహంలో నవ్వు చూస్తుంటే ఆయనకు మనసులో నటించాలని కోరిక ఉన్నట్లుంది.

"లేదండీ.. యమధర్మరాజు మీరెయ్యాలి" అన్నాడా వ్యక్తి.

తప్పదన్నట్లుగా 'సర్లే!' అన్నాడు నాన్న.

"సరే నే వస్తానండీ. పై ఆదివారం పెట్టుకుందాం నాటకం" అని చెప్పి లేచాడా వ్యక్తి.

"ఉండవయ్యా.. ఫలహారం తిని వెళ్దువుగాని" అని బలవంతంగా అతడ్ని కూర్చోబెట్టి అతడి దగ్గర టిఫిన్ తినిపించి మరీ వదిలాడు. అతను వెళ్ళిన తర్వాత సతీసావిత్రి నాటకంలోని పద్యం కూనిరాగం తీయడం మొదలు పెట్టాడు నాన్న.

"ఎంత వయస్సు వచ్చినా ఈ రంగుపిచ్చి ఉన్నవాళ్ళు ఇంతే కాబోలు" అనుకున్నాను నాన్నవైపు చూస్తూ.

నాన్న రోజూ రిహార్సిల్స్‌కి వెళ్ళడం – ఇంటి దగ్గర అప్పుడప్పుడూ గొంతెత్తి పాడ్డం చేస్తున్నాడు. ఆ రోజు సాయంత్రం నాటకం అనగా ఉదయాన్నే ఇంటికొచ్చిన చింతలాపురం వ్యక్తి –

"చూడండీ నాయుడుగారూ మీరు ఈ ఊరికి ప్రెసిడెంటు పెద్ద రైతు. మీరు నటించే నాటకం అంటే ఊరూర్నించీ జనం వస్తారు. అందుకని యమధర్మరాజు స్టేజి మీదకు వచ్చే సీను చాలా అట్టాహాసంగా ఉండాలి. దాదాపు పాతిక మందిని తప్పెట్లు తాళాలు తీసుకురమ్మన్నాను. అంతేకాదు తమరు చెక్కదున్నపోతు మీద కాకుండా మాంచి నిజమైన దున్నపోతు మీదే స్టేజిమీదకొస్తే బాగుంటుందన్నారు నాటకం గురువు. మీ ఇష్టం" అన్నాడు.

రెండు నిమిషాలు ఆలోచించి –

"అలాగే" అన్నాడు నాన్న. అతడు వెళ్ళిపోయాడు అంతే –

"రేయ్!" ఎంగిసిగా! మన దొడ్లోని దున్నపోతుని సుద్దంగా తోమి కడుగు. కొమ్ములకు రంగెయ్యి" అని హడావిడి చేశాడు నాన్న.

ఆ క్షణం నుంచీ దున్నపోతుని కడగడంలో నిమగ్నమయ్యాడు వాడు.

వానొస్తే తప్ప కరగని దున్నపోతు వంటిమీద మట్టిని రుద్ది రుద్ది కడిగాడు.

పచ్చగడ్డి మొహం ఎరగని ఆ దున్నపోతు కొమ్ములకు పచ్చరంగేశారు.

సాయంత్రానికి దున్నపోతును అందంగా అలంకరించారు.

నాన్నగారి ఆజ్ఞానుసారం నేనే దగ్గరుండి నాటకం వేసే దగ్గరకు దున్నపోతుని తీసుకెళ్ళాను.

నాటకం చూడ్డానికి చాలామంది జనం వచ్చి ఉన్నారు.

జనాల్లో ఓ మూల తల్లి ప్రక్కన కూర్చున్న కిష్టడ్ని చూసేసరికి –

"వాడు ఆరోగ్యంగానే ఉండి మా ఇంట్లోనే ఉండి ఉంటే ఈ రోజు పెత్తనమంతా వాడిదేగా?" అనుకున్నాను.

"నాయుడుగారు మీరు దున్నపోతు మీదెక్కి రెడీగా ఉండండి" అన్నాడు రిహార్సల్స్ చేయించే గురువు.

"ఎప్పుడో చిన్నప్పుడు తమాషా కోసం దున్నపోతునెక్కానయ్యా! మళ్ళీ ఇప్పుడెక్కుతున్నా' అంటూ దున్నపోతు మీదెక్కాడు నాన్న.

ఇప్పుడు నాన్నని చూస్తుంటే అచ్చం యమధర్మరాజులానే ఉన్నాడు.

"దున్నపోతు ముక్కుతాడు గట్టిగా పట్టుకోరా ఎంగిసిగా" పాలేర్ను దబాయించాడు నాన్న.

"నాయుడుగారూ మీరు పడిపోకుండా ఉండడం కోసం కాళ్ళు ఎందు కట్టేస్తా బాగుంటుందేమో?" అన్నాడు చింతలాపురం వ్యక్తి.

ఓ నిమిషం ఆలోచించి 'సరే' అన్నాడు నాన్న. అంతే వెంటనే తాళ్ళు తీసుకువచ్చి నాన్న కాళ్ళు రెండు దున్నపోతుకేసి బిగించి కట్టారు.

తప్పెట్లు వాయించే వాళ్ళు గడ్డి తగలబెట్టి తప్పెల చర్మాలకి సెగపడుతున్నారు బాగా శబ్దం వచ్చేందుకు.

"సీను రెడీ" అన్నారు.

తప్పెట్ల మోత మొదలయ్యింది.

మెల్లగా దున్నపోతు ముక్కుతాడు పట్టుకుని స్టేజి మీదకు తీసుకువెళ్ళారు.

తెర తొలిగింది.

నాయుడుగారికి కర్పూర హారతులిచ్చారు.

"మీసాల వెంకట రత్నం నాయుడుకి జై" మైకులోంచి అరిచారు. కూర్చున్న వారందరు కూడా అరిచారు. తప్పెట్ల మోత తారాస్థాయికి చేరుకుంది.

స్టేజ్ మీదనుంచి జనాలందరినీ చూసింది దున్నపోతు – ఎవ్వరూ ఊహించనంత వేగంగా ముక్కుతాడు విదిలించుకుని పరుగు లంఘించుకుంది దున్నపోతు.

దానిపైన దిగడానికి వీలులేకుండా కట్టేసి ఉన్న నాన్న భయంగా కేకలేశాడు. నాన్నగారి కేకల్ని లెక్కచేయకుండా ముళ్ళ కంపల వైపు పరుగుతీసింది దున్నపోతు. వెనకనే పరుగెట్టారు జనం. ఎలాగోలా కష్టపడి మొత్తం మీద దున్నపోతుని పట్టుకుని నిలేశారు – నాన్నగారి వళ్ళంతా గీచుకుపోయి రక్తం వస్తోంది.

"వెధవ దున్న..థూ!" అని కీకరించి ఉమ్మేశాడు నాన్న.

కిష్టడు కూడా అక్క డకు వచ్చి నాన్నగారి వంక దున్నపోతు వంక మార్చి మార్చి చూడసాగాడు. వాడి చూపులు – "నోరులేనిదానివైనా నీ నోటికాడ పచ్చగడ్డి పెరికేసిందానికి పెతీకారం తీరుసుకున్నావ్. నాకన్నా నువ్వే గొప్పదానివి. ఏళ్ల తరబడి నా కండలన్నీ ఆల్లింటికే దారబోసినా జబ్బున పడ్డాక డబ్బులివ్వనని నాయుడోరు తెగేసి సెప్పినా నోరున్న నేను ఓ మాట కూడా అనలేకపోయా. నాకన్నా నువ్వే ఎంతో గొప్ప.." అని దున్నపోతుని అభినందించినట్లుంది.

COMMENTS